# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 30 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08




# విద్యార్థులు పొదుపుపై అవగాహన పెంపొందించుకోవాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పొదుపు, ఆర్థిక నిర్వహణ, పెట్టుబడులపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐడీఓసి కార్యాలయంలో ది అప్రెంటిస్ ప్రాజెక్ట్ భాగస్వామ్యంతో ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ప్రత్యేక ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యంగా ప్రత్యేక ఫైనాన్షియల్ లిటరసీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతకాలంలో విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు జీవిత నైపుణ్యాలు, ముఖ్యంగా ఆర్థిక నిర్వహణపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఆదాయం, పొదుపు, బడ్జెట్ రూపకల్పన, తరువాయి 2లో...

# పేదల వైద్యానికి సిఎంఆర్ఎఫ్ అండ

### రూ. 61.61లక్షల విలువైన 111 చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** పేద ప్రజల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ ఓసిటీలోని తన క్యాంప్ కార్యాలయంలో రూ.61.61 లక్షల విలువైన 111 సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. వైద్య ఖర్చుల భారం నుండి పేద కుటుంబాలకు ఉపశమనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ధర్మకర్తలు, డివిజన్ అధ్యక్షులు, చైర్మన్, పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

### భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు
### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
### యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మత్తు పదార్థాల దుష్ప్రభావంపై అవగాహన

**ప్రజాపక్షం/హనుమకొండ :** యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.మంగళవారం హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కొంతమంది యువత సరదా, స్నేహితుల ప్రభావం, ఆసక్తి వంటి కారణాలతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఒకటి రెండుసార్లు తీసుకుంటే ఏమవుతుందనే నిర్లక్ష్య ధోరణి ప్రమాదకరమని, అదే క్రమంగా వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ.. తరువాయి 2లో...

# రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

2

# జీరో యాక్సిడెంట్ జోన్‌గా మెదక్‌ను తీర్చిదిద్దాలి

8



కలెక్టర్ ప్రతిమా సింగ్



## గుడుంబా తయారీపై పోలీసుల ఉక్కుపాదం

**ప్రజాపక్షం/నర్సింహులపేట :** పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సింహులపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాతండా, చింతల తండా, అమీర్యా తండా, కొత్త తండాల్లో కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని పోలీసుల నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి వినియోగిస్తున్న రెండు వేల లీటర్ల బెల్లం వాష్ ధ్వంసం చేసి మూడు క్వింటాళ్ల నల్లబెల్లం, 40లీటర్ల గుడుంబాను సాధీనం చేసుకున్నారు. మొత్తం 15మంది నుండి ఈ సరుకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్వ నేరచరిత్ర, బైండోవర్ వివరాలను పరిశీలించి సంబంధిత చట్టపరమైన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో సిఐ గణేష్, స్థానిక ఎస్సై వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

**నాటుసారాయి కేసులో 16మంది బైండోవర్**

మండలంలోని గోప తండా,జగ్గుతండా జీపీ పరిధిలో నాటు సారాయి తయారు,విక్రయాలకు పాల్పడిన 16మందిని తహసీల్దార్ రమేష్‌బాబు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. మళ్ళీ నాటు సారాయి కేసులో పట్టుబడితే 2లక్షల జరిమానా లేదా జైలుశిక్షకు కట్టుబడి ఉండేలా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో కేసులు నమోదై బైడోవర్ అయిన ముగ్గురికి కూడా రెండు రోజుల్లో నోటీసులు జారీ చేస్తామన్నారు. ఇకపై నాటుసారాయి అక్రమ తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుందని హెచ్చరించారు.

## గుండెను కాపాడుకుంటేనే జీవితం పదిలం

సామాజికవేత్త, మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ సామాజికవేత్త, మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ సూచించారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమని అన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు నడక, యోగా లేదా తగిన వ్యాయామం చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలను తగ్గించి, కూరగాయలు, పండ్లు, పౌష్టికాహారం, తెల్ల బియ్యం తగ్గించి చిరుధాన్యాలైన మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ధూమపానం, అధిక మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. అలాగే రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి అంశాలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడంతో పాటు, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణమైన అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని నిమ్మల శ్రీనివాస్ సూచించారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థి దశలోనే మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సంచాలకులు ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ... జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావన, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కుమార్‌స్వామి మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే చట్టపరమైన, ఆరోగ్యపరమైన, సామాజిక పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ చందర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పొదుపుపై అవగాహన పెంపొందించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులు, ఆర్థిక నిర్ణయాలపై చిన్నతనం నుంచే సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ద్వారా ఆర్థిక అవగాహన వారి కుటుంబాలకు, అక్కడి నుంచి సమాజంలోని ప్రతి ఒక్కరికీ విస్తరించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాను తొలి జిల్లాగా ఎంపిక చేసిన సంస్థను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రణాళికపై ఉపయోగకరమైన అవగాహన ఏర్పడి, దీర్ఘకాలంలో మంచి ఫలితాలు సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ స్ఫూర్తితో జిల్లాలోని పాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అవగాహన కలిగిన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ లలిత, సంస్థ సహ వ్యవస్థాపకులు ప్రశాంత్, మౌనిక గార్గ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజా పక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మంగళవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా భూమి రీ సర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలను పారదర్శకంగా, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియపై రైతులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, అనుమానాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.రైతులకు ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రీసర్వే ప్రక్రియలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సహకారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గ్రామ సీనియర్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత గడువులోగా సిఎంఆర్ డెలివరీ పూర్తి

రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ ఎన్.రవి సమావేశం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పౌర సరఫరాల శాఖ అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్లతో సీఎంఆర్ అందజేత అంశంపై అదనపు కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఎఫ్.సి.ఐ, పౌరసరఫరాల కార్పొరేషన్‌కు చేరవేయాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ లెక్కల పై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మహేందర్, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బంది, రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్దేశిత గడువు లోగానే సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సిఐ, పౌరసరఫరాల సంస్థలకు అందించడంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా షెడ్యూల్ ప్రకారమే పూర్తయ్యేలా అందించాలన్నారు. ఇప్పటివరకు సరఫరా చేసిన బియ్యం నిల్వలు, మిగిలిన కోటా లెక్కలను పక్కాగా సరిచూసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సీఎంఆర్ అందజేత ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల డీటీలు, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం



పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** పాడి గేదెల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ కుటుంబాల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ముందడుగు వేస్తూ శ్వేత విప్లవం ద్వారా గ్రామీణ కుటుంబాల ఆర్థిక బలోపేతం చేసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున ఆత్మకూరు మండలంలోని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను అక్కంపేట, కామారం, పెంచికల పేట, నీరుకుల్ల గ్రామాలలో మంజూరైన పాడి గేదెలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభించి, వారు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.శ్వేత విప్లవం తీసుకురావడంలో భాగంగా దామెరలో మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో 40 వేల కుటుంబాలను డైరీలో చేర్పుతామని అన్నారు. పాడి గేదెలను సక్రమంగా సంరక్షిస్తూ, పాడి ఉత్పత్తిని పెంచుకొని అదనపు ఆదాయం పొందాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు సర్పంచులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు

కాళేశ్వరం జోన్-1 డిఐజి అంబర్ కిశోర్ ఝా ఆదేశం

**ప్రజాపక్షం/కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం కాళేశ్వరం జోన్1డీఐజీ అంబర్ కిశోర్ ఝా ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు.అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీసారు. పోలీస్ స్టేషన్‌లో తరుచూగా నమోదయ్యే నేరాలు, గ్రామాల పరిస్థితి, శాంతి భద్రతల పరిస్థితి, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, బాధితులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లో ఉన్నవ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించిన డీఐజీ కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## వెంటనే పిఆర్‌సి ప్రకటించాలి

**ప్రజాపక్షం/కమలాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్ మండలం కానిపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతూ... ఈ నెలాఖరుతో పిఆర్‌సి గడువు ముగుస్తున్నందున, గడువు పొడిగించకుండా వెంటనే నివేదికను బహిర్గతం చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు డిఏలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని, దసరా సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, జీవో 25 ను సవరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిఎన్ఆర్ మల్లిక్, సీనియర్ నాయకులు పల్లె శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లకు నిబంధనలు తప్పనిసరి

ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్.. కఠిన చర్యలు

**ప్రజాపక్షం/చిట్యాల :** ఇసుక ట్రాక్టర్లు నిబంధనలను తప్పకుండా పాటించాలని, లేకుంటే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ అన్నారు. మండలంలోని మానేరు వాగు ప్రాంతాన్ని ఎస్ఐ సతీష్ మంగళవారం పరిశీలించారు.ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇసుక రవాణాలో ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి ట్రాక్టర్‌కు ఇసుక లోడింగ్ కూలీలకు రూ.800 మాత్రమే చెల్లించాలని సూచించారు. ట్రాక్టర్లకు ఆర్‌టిఏ ఆమోదించిన నంబర్ ప్లేట్లు ఉండాలని, డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలకు చెల్లుబాటు అయ్యే బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. రవాణా సమయంలో ఇసుక రోడ్డుపై పడకుండా ట్రాక్టర్లపై గ్రీన్ మ్యాట్ కప్పాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్సి, ఎస్టి మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** నిరుపేద ఎస్సి, ఎస్టి మహిళలకు 100% సబ్సిడీతో కుట్టు మిగషన్లు ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి మహిళలకు ఇస్తున్నట్లుగానే ఎస్సి, ఎస్టి మహిళలకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకం ప్రారంభించాలని, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్క చొరవ తీసుకోవాలని కోరారు.

## నర్సక్కపల్లిలో పోషణ మాసం కార్యక్రమం

పరకాల సిడిపిఒ స్వాతి



**ప్రజాపక్షం/నడికూడ :** పోషణ మాస కార్యక్రమంలో భాగంగా నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలోని ఒకటి, నాలుగు అంగన్వాడి సెంటర్ లలో కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల సిడిపిఒ స్వాతి పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీలో అందించే సేవల గురించి, గర్భిణీల తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పిల్లల పోషకాహారం, ఆకుకూరల ప్రాముఖ్యత, పోషకాహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే అనారోగ్యాలు, వాటి వల్ల కలిగే నష్టాల గురించి, అలాగే రక్తహీనత,తక్కువ బరువు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. ప్రతిజ్ఞ కూడా చేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హేమలత, కార్యదర్శి వెన్నెల, పోషణ అభియాన్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

## శిథిలావస్థలు కాకతీయుల శివాలయం!



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం చిన్నకోర్పోల్ గ్రామంలో కాకతీయులకాలం నుండి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి దాతల సహకారం అవసరమైంది. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు భవిష్యత్ తరాలకు ఈ వారసత్వాన్ని అందించేందుకు భక్తులు, శివభక్తులు ముందుకు రావాలని గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి సిమెంట్, కంకర, ఇసుక, ఇనుము, ఇటుకలతో పాటు గర్భగుడి రాతి దర్వాజా, విద్యుత్, ప్లంబింగ్ సామాగ్రి, వివిధ విగ్రమాలు, ధ్వజస్తంభం తదితరాలు అవసరమని తెలిపారు. నగదు లేదా నిర్మాణ సామాగ్రి రూపంలో సహాయం అందించాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకరించే దాతల పేర్లను శిలాఫలకంపై ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. చారిత్రక ఆలయాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతగా భావించి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సహాయం చేయదలచిన వారు కొయ్యడ అనిల్, చిన్న కోర్పోల్ 9491998697ను సంప్రదించాలని కోరారు.

# కలెక్టరేట్ సిద్ధం..ప్రారంభం ఎప్పుడో?

కుటుంబ పదవులపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదా?

బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్న నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. సిటీ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట బూడిద గుమ్మడికాయ కొట్టి దిష్టి తీశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ కలెక్టరేట్ భవనం పూర్తయినా ప్రారంభించకపోవడానికి కారణమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రజలు హనుమకొండకు వెళ్ళాల్సి వస్తోందన్నారు. ఏ శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కుటుంబంలో ఎవరికి ఏ పదవి రావాలి..ఎవరు ఎంఎల్‌సి, ఎంఎల్‌ఏ కావాలనే ఆరాటం తప్ప ప్రజల సమస్యలపై శ్రద్ధ కనిపించడం లేదని విమర్శించారు. విమ్మల్ని గెలిపించిన వరంగల్ తూర్పు ప్రజలకు ఏం న్యాయం చేస్తున్నారని ప్రశ్నించారు.కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించి జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలని, తూర్పు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గోకుల రాణా ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## "వాక్ ఫర్ ఎ హెల్తియర్ హార్ట్" నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్

గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వైద్య నిపుణులు

వాకథాన్, జుంబా కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ ఎ హెల్తియర్ హార్ట్" పేరుతో ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ నుంచి భద్రకాళి బండ్ (ట్యాంక్ బండ్) వరకు వరల్డ్ హార్ట్ డే వాకథాన్ నిర్వహించారు. ప్రజలు నిత్య జీవితంలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు.కార్యక్రమంలో భాగంగా గుండె ఆరోగ్యంపై నిపుణుల అవగాహన సదస్సుతో పాటు జుంబా డాన్స్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. దీంతో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటూ గుండె జబ్బుల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన పొందారు. ఈ అవగాహన కార్యక్రమానికి మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ సీనియర్ కార్డియాలజీ నిపుణులు డాక్టర్ సంతోష్ మోహన్‌లాల్ మోదాని, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్; డాక్టర్. శ్రవణ్ కుమార్ రాంపెల్లి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్; డాక్టర్ షఫీ పాలగిరి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, గుండె సంబంధిత హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలి. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.ఆరోగ్యకరమైన జీవనశైలితోనే గుండె జబ్బులను చాలా వరకు నివారించవచ్చు" అని అన్నారు.

## ఆయిల్ పామ్ రైతులు ఐక్యంగా ఉండాలి



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** అయిల్ ఫామ్ సాగు చేసే రైతులు ఐక్యంగా ఉండి ఉధ్యానవన శాఖ అధికారుల సహకారంతో మేలుకువలపై అవగాహన పెంచుకోవాలని అయిల్ ఫామ్ సాగుదారుల వరంగల్ జిల్లా అధ్యక్షుడు నంద్యాల కృష్ణరెడ్డి అన్నారు . మంగళవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని రైతు వేధికలో మండల అయిల్ ఫామ్ సాగు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మండల కమిటిని ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా నంధ్యాల కృష్ణరెడ్డి మాట్లాడుతూ రైతులకు అదాయం ఇచ్చే పంటల వైపు మొగ్గు చూసి ఆర్థికంగా ఎదుగాలని కోరారు . అనంతరం మండల అయిల్ ఫామ్ రైతుల సాగుదారుల కమిటిని ఎన్నుకోనగా అధ్యక్షునిగా కొండాయిలుపల్లి గ్రామానికి చెందిన కొలగాని రామారావు , ప్రదాన కార్యదర్శిగా గోనే వీరాస్వామి ,కోశాధికారిగా నల్లబెల్లి గ్రామానికి చెందిన నీల వెంకటేశ్వర్లు గుప్త ,ఉపాధ్యాక్షులుగా రుద్రగూడెం గ్రామానికి చెందిన అనుముల ముత్తారెడ్డి ,పెద్ది కృష్ణరెడ్డి ,కార్యదర్శిగా పాల్తియ సారయ్యలను ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు చాగా కొమురారెడ్డి ,జిల్లా కార్యదర్శి కుంచారపు వెంకట్‌రెడ్డి ,చిట్యాల వెంకట్‌రెడ్డి ,దొమ్మటి బచ్చయ్య ,శంకరయ్య తదితరులు పాల్గోన్నారు .

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కొసం కార్యకర్తలు కృషి చేయాలి



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** కాంగ్రేస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త కృషి చేసి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రేస్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు . మంగళవారం నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామంలో కాంగ్రేస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో గ్రామ పార్టీ కమిటి ఏర్పాటు చేసి మాట్లాడారు . రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలన్నారు . అనంతరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్‌తో కలిసి గ్రామ పార్టీ కమిటి ఎన్నుకోనగా అధ్యక్షునిగా వద్లూరి రమేష్ , వర్కింగ్ ప్రెసిడెంటు పోగుల కుమారస్వామి ,ఉపాధ్యాక్షులు గజ్జి క్రాంతి కుమార్ ,శ్రీపతి కుమారస్వామి ,గౌరవ అధ్యక్షుడు తిప్పని చేరాలు తదితరులను ఎన్నుకున్నారు .

## వీరస్వామి కుటుంబానికి రంజిత్ రెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పసునూటి వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నర్సంపేట నియోజకవర్గ టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి పత్తిపాకకు చేరుకొని వీరస్వామి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, నెక్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుమల, సర్పంచ్ లావుడ్యా సామ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బోడ శ్రీకాంత్ నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉసులపాటి రాజు, సొసైటీ డైరెక్టర్ పసునూటి లక్ష్మి నారాయణ, వార్డు సభ్యులు తరుణ్, బోడ రజిత, పాల్గొన్నారు.

## పితృస్మరణతో మహాలయ పక్షారంభం

**ప్రజాపక్షం/నెక్కొండ :** పితృదేవతలను స్మరించుకునే పవిత్ర మహాలయ పక్షం ఆదివారం నుండి ప్రారంభమయ్యింది. భాద్రపత బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు కొనసాగే పితృపక్షంలో ప్రజలు తమ పూర్వీకుల మరణ తిధులను అనుసరించి శ్రాద్ధకర్మలు, తిలతర్పణం, పిండప్రదానం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. తిధి తెలియని వారు మహాలయ అమావాస్య నాడు పితృస్మరణ, తప్పణాది కార్యక్రమాలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. మహాలయ పక్షం కేవలం ఆచారాలకు పరిమితం కాకుండా పూర్వీకుల పట్ల కృతజ్ఞత, కుటుంబ మూలాలను గుర్తు చేసుకునే సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారు. మహాలయ పక్షంలో తర్పణాలు, శ్రాద్ధకర్మలు, అన్నదాన కార్యక్రమాలతో పితృదేవతలను భక్తిశ్రద్ధలతో సిద్ధమవుతున్నారు.

## రెడ్ క్రాస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వెంకటనారాయణకు సన్మానం




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఇటీవల జరిగిన రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ పాలకవర్గ ఎన్నికలలో ఏకగ్రీవంగా వైస్ చైర్మన్ గా ఎన్నికైన పెద్ది వెంకట నారాయణ గౌడ్ ను హనుమకొండలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి, జిల్లా సెక్రటరీ ఆదరి రవీందర్, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ సెక్రటరీ గూడెల్లి ధర్మేందర్ రెడ్డి, పాతపల్లి సంపత్ యాదవ్, రంగు రాజు, రంగు రవీందర్, నోముల రమేష్, గోపగాని రవి, నారగోని నరేందర్, చిటుకూరి అనిల్ కుమార్, కాలేరు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సన్మానించిన వారందరికీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## 30న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/నర్సంపేట :** భవన నిర్మాణ కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని బిఆర్‌టియూ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగుఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు గత 15 సంవత్సరాలుగా నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి రూ. 446 కోట్లు దారి మళ్ళించారని, భవన నిర్మాణ కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు దారిని అందించాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పకూడదని దారి మళ్లించిన రూ. 446 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలని బోర్డులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సిబిఐ చేత విచారణ జరిపించాలని కోరారు. రేపు తెలంగాణ భవన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి కార్మికుల పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిఆర్‌టియూ రాష్ట్ర కమిటీ సభ్యులు కొల్లూరు లక్ష్మి నారాయణ, భవన నిర్మాణ కార్మికులు ఓరిగంటి కుమారస్వామి, కృష్ణ పస్తం, నేరెళ్ల బిక్షం, కొరబోయిన కుమారస్వామిలు అన్నారు.

## కెటిఆర్‌ను కలిసిన పెద్ది స్వప్న



**ప్రజాపక్షం/ నర్సంపేట/ఖానాపురం :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా మాజి జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి మంగళవారం కలిశారు. దివంగత నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తరువాత మంగళవారం హైదరాబాదులోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గ పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

## రెడ్ క్రాస్ అభివృద్ధికి కలిసి పనిచేయండి

**ప్రజాపక్షం/జనగామ** : జిల్లాలో రెడ్ క్రాస్ అభివృద్ధికి కలిసి మేనేజింగ్ కమిటి సభ్యులు



కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సూచించారు. మంగళవారం నూతనంగా ఎన్నికైన రెడ్ క్రాస్ నూతన మేనేజింగ్ కమిటి సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడో సారి ఛైర్మన్‌గా డాక్టర్ లవకుమార్‌రెడ్డి ఎన్నికల కావడం అభినందనీయమన్నారు. 15 మంది సభ్యులు ఎన్నిక కావాల్సి ఉండగా 17 మంది నామినేషన్లు వేశారని, కన్నా పరశురాములు, కృష్ణజీవన్ బజాజ్ పోటీ నుండి తప్పుకోవడంతో కమిటి ఏకగ్రీవమైందని వివరించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన డాక్టర్ లవకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ ఇ ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి గాదె క్యాథరిన్, ఎంసి సబ్యులులుగా దొంతుల శేఖర్, మేనేజింగ్ కమిటి సభ్యులు వేమళ్ల నరసింహరెడ్డి, పేర్వారం ప్రభాకర్, డాక్టర్ హేమంత్‌రాజ్ పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన బీసుల నిర్మల

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలంలోని కిష్టారావుపేట గ్రామానికి చెందిన మహిళా మణి



బిసుల నిర్మల మంగళవారం బిజెపిఈ పార్టీలో చేరారు. బిజెపి మండల అధ్యక్షుడు రాంషెట్టి మనోజ్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుచల్ల నారాయణ రెడ్డి సమక్షంలో చేరిన నిర్మలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలు,ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్శితులైన నిర్మల బిజెపిలో చేరారని తెలిపారు. రానున్న కాలంలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యకతం చేసారు. ఈ కార్యక్రమంలో సాయి, రాజు, నవీన్ తదితులు పాల్గొన్నారు.

## సృజనాత్మక పోటీలు

**ప్రజాపక్షం/నర్సంపేట:** భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా



సంకల్ప్ అభియాన్ లో భాగంగా నర్సంపేట పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హై స్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, స్పీచ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రాణా ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పాశికంటి రమేష్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్, సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

### జిల్లా సంక్షేమాధికారి జి.మల్లేశ్వరి

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 1న నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి, స్త్రీ, శిశు, దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని ప్రణామ్ డే కేర్ సెంటర్‌లో నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా సంక్షేమాధికారి జి.మల్లేశ్వరి ప్రారంభించారు. డీఎం హెచ్ఓ డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలో వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వైద్య సలహాలు అందించారు. వయోవృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 70



మంది వయోవృద్ధులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వయోవృద్ధుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారి పట్ల సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి జి.మల్లేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అర్జున్, ప్రణామ్ డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కె.సంజీవరావు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రోహిణీలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/రఘునాథపల్లి** : హిందువులు పవిత్రంగా పూజించే ధర్మ మార్గాన్ని ఆచరించిన శ్రీరాముడు, కైలాస నాధుడు ఆ పరమశివుడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ ధర్మానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పిలుపు మేరకు మంగళ వారం మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు వేణు కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా కలిసి బస్టాండ్ ప్రాంగణంలోని అండర్ పాస్ వద్ద ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కాంగ్రెస్ పార్టీ హిందూ ధర్మం పట్ల, దేవుళ్ళ పట్ల దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని అయన హితం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరాముడు, పరమశివుడి మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన




డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల ప్రధాన కార్య దర్శి ఉడుత రంజిత్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మల్లాల ఉపేందర్, ఆకుల రామచందర్, యామంకి కొమురెల్లి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మేడిపల్లి వెంకటేష్, కావటి ప్రవీణ్, తోట మహేష్, చేవ్వ రాజు, బోల్ల అఖిల్, గణేష్ సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణకు ఇంటింటా అవగాహన కల్పించాలి

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పించాలని వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, జిల్లా మాతా సంరక్షణ కార్యక్రమ అధికారి డాక్టర్ చీర్ల.శ్రీకాంత్ సూచించారు.ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం జిల్లాలో ఆగస్టు 15 నుంచి అక్టోబర్ 12 వరకు అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మంగళవారం వెంకటాపూర్ పీహెచ్‌సీలో పల్లె దవాఖానల



వైద్యాధికారులు, మండల ఉపకేంద్రాల ఆరోగ్య కార్యకర్తలు, వెంకటాపూర్, లక్ష్మీదేవిపేట ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గృహ సందర్శనల సమయంలో ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై సిఫిలిస్ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ రవితేజ ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ రవి తేజ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దిశా సీఎస్ఓ సమ్మయ్య, పల్లె దవాఖానల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఐసీటీసీ, పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని విడగొట్టే కుట్ర

### గుర్రపు నాగరాజు గౌడ్

**ప్రజాపక్షం/టేకుమట్ల:** ధనికులు రామున్ని పూజిస్తారని పేదలు శివుడిని పూజిస్తారని మాట్లాడి హిందూ సమాజంలో మరో విభజనకు తెరలేపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను ఖండిస్తూ మండల బిజెపి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ మోడి భక్తి గురించి మాట్లాడే స్థాయి నీచపు మాటలు మాట్లాడే రేవంత్ రెడ్డికి లేదన్నారు. మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం వారణాసి వేల సంవత్సరాల చరిత్ర ఉన్న శైవ క్షేత్రం, మన రాష్ట్రంలో ప్రముఖ శివాలయం వేములవాడ రాజన్నను దర్శించుకున్న ఏకైక ప్రధానమంత్రి మోడీ అని అన్నారు. రేవంత్ రెడ్డి దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న బ్రిటిషోడి పాలసీ అయిన విభజించు పాలించు పద్ధతిని మరోసారి తెరమీదికి తీసుకొచ్చారన్నారు. హిందూ సమాజాన్ని విడగొట్టడానికి కులాలు ప్రాంతాల మధ్య విభజనతో పాటు కొత్తగా దేవుడిని ఆరాధించే వాళ్లలో కూడా విభజనలకు తెరలేపడం అత్యంత నీచమైన కుట్ర, హిందూ సమాజం




ఇలాంటి నీచపు కుట్రల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, మెజారిటీ హిందూ సమాజాన్ని విభజించి మైనారిటీలను ఏకం చేసి భారతదేశాన్ని హిందూ సమాజాన్ని నాశనం చేసే కాంగ్రెస్ పార్టీ కుట్రలకు హిందూ సమాజం సరైన సమయంలో గుణపాఠం నేర్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య, జిల్లా నాయకులు కూర సురేందర్ రెడ్డి, బిజేవైఎం మాజీ మండలాధ్యక్షుడు పంజాల కుమార్‌గౌడ్, బిజేవైఎం జిల్లా నాయకుడు చిట్యాల విజయ్‌కుమార్ రెడ్డి, రాజుల రాకేష్, చిలుక ప్రణీత, మంద వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## దేవరుప్పుల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తోటకూరి రమేష్

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షునిగా తోటకూరి రమేష్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి నియమించారు. ఈ సందర్భంగా రమేష్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్, నాయకులు నాగరాజు, సజ్జన్, సుధాకర్ రెడ్డి, రాజయ్య, రాంబాబు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలిసిన నల్ల యాదగిరి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని దేవరుప్పుల మండల వీవర్స్ సెల్ అధ్యక్షుడు నల్ల యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని చేనేత కార్మికుల సమస్యలు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యేతో చర్చింరారు. నేతన్నలకు పథకాల ప్రయోజనాలు అందేలా సహకరించాలని కోరినట్లు యాదగిరి తెలిపారు.

## సహజ వ్యవసాయంపై అవగాహన

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** రైతు వేధికలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి, ఏఈవో, ఆర్గానిక్ ఇన్స్‌పెక్టర్, తదితరులు పాల్గొని సహజ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. జీవామృతం, ఘనజీవామృతం, కషాయాల తయారీ, ప్రయోజనాలను రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో సాగు చేసి భూసారం కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హిమ్మత్‌నగర్ రైతులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్‌చైర్మన్‌గా రాజ్ కుమార్

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ గా దుగ్గొండి మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన శానబోయిన రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి జడ్పీ సిఈవో వసంత నియామక పత్రం అందజేశారు. విదేశాలలో ఉన్నత చదువులు అభ్యసించి కొంతకాలం పాటు ఉద్యోగం చేసిన అనంతరం స్వగ్రామానికి చేరుకున్న రాజ్ కుమార్ ప్రజా సేవే లక్ష్యంగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.రాజ్ కుమార్ ను మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు మంగళవారం అభినందించారు. తన ఎన్నికకక సహకరించిన పేరుపేరు కృతజ్ఞతలు తెలిపారు

## అందుబాటులో యూరియా

**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండల రైతుల అవసరాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా నిల్వ అందుబాటులో ఉందని సొసైటీ చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి తెలిపారు. యూరియా అవసరమైన రైతులు సొసైటీ కార్యాలయంలో ముందుగా బుక్ చేసుకుని పొందాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటలకు అవసరమైన ఎరువులను సమయానికి పొందాలని కోరారు.

## మున్సిపల్ పరిధిలో రెస్టారెంట్, బార్ లైసెన్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట మున్సిపల్ పరిధిలో రిటైల్ రెస్టారెంట్, బార్ ఏర్పాటు చేసి నిర్వహించేందుకు ఫారమ్2బి లైసెన్సుల జారీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన వ్యక్తులు, వ్యాపార సంస్థలు లక్ష రూపాయలు డిడి/చాలన్ కట్టి దరఖాస్తు ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సెప్టెంబర్ 28, 2026 నుంచి అక్టోబర్ 12, 2026 వరకు పని దినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు వరంగల్ లోని డిపిఇఒ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. లైసెన్సుల ఎంపికకు సంబంధించిన లాటరీ డ్రా అక్టోబర్ 16, 2026న నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఎయిర్‌పోర్ట్‌కు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

## కురుమ సంఘం జిల్లా కన్వీనర్ కోరె సుధాకర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వరంగల్ మమునూరు ఎయిర్‌పోర్ట్‌కు తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు వీరుడు దొడ్డి కొమురయ్య పేరును పెట్టాలని కోరె సుధాకర్ కురుమ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్యకు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ ప్రజల విముక్తి కోసం, తన ప్రాణాన్ని పణంగా పెట్టిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరును వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్ కు నామకరణం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ కోరె సుధాకర్ కురుమ డిమాండ్ చేశారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ఖానాపురం :**మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త భూక్య రవి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన కుటుంబానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఆత్మ డివిజన్ చైర్మన్ యడ్ల బిక్షంరెడ్డి ఆధ్వర్యంలో రూ.50వేలు సేకరించి కుటుంబ సభ్యులకు అందించారు. పరుచూరి రత్నాకర్‌రావు, చదలవాడ బసవకుమార్ చెరో 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు మండవ ప్రసాద్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్‌రావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె ముస్తఫా, సొసైటీ డైరెక్టర్లు దేవినేని వేణుగోపాల్‌రావు, మర్రి ప్రభాకర్, వార్డు సభ్యులు శాఖమూరి ముఖేష్ చౌదరి, చలిగంటి మల్లికార్జున్, నాయకులు శాఖమూరి కృష్ణారావు, తోటకూరి రాజుయాదవ్, మాజీ వార్డు సభ్యుడు బోడ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# వేం నరేందర్‌రెడ్డిని కలిసిన గబ్బేట బాబు

**ప్రజాపక్షం/రాయపర్తి :** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గబ్బేట బాబు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గాల అభివృద్ధి, నిధుల వినియోగం, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు గబ్బెట బాబు పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పలు అంశాలపై వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఎస్‌సి వర్గాల సమస్యలను ప్రభుత్వ స్థాయిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని గబ్బెట బాబు కోరారు.

# వయోవృద్ధులతో విద్యార్థుల మమేకం

## ఆటపాటలతో సందడిగా వయోవృద్ధుల వారోత్సవాలు



**ప్రజాపక్షం/ములుగు :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం...2026ను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని ప్రణామ్ డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధులకు క్రీడలు, పాటల పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా పాల్గొన్న వయోవృద్ధులు తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు అక్టోబర్ 1న జరిగే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగాలపల్లి, బండారుపల్లి తెలంగాణ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల విద్యార్థులతో మమేకమై తన జీవిత అనుభవాలు, ఆనాటి సామాజిక పరిస్థితులు, విలువలు, కష్టసుఖాలు, మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యార్థులు ఆసక్తిగా వారి అనుభవాలను విన్నారు. వయోవృద్ధుల అనుభవాలు జీవంతమైన పాఠ్యపుస్తకాల వంటివని అధికారులు పేర్కొన్నారు తరాల మధ్య అనుబంధం పెంపొందించడం, వయోవృద్ధుల పట్ల గౌరవభావాన్ని పెంచడం, వారి అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించడమే కార్యక్రమాల ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో వయోవృద్ధుల సారయ్య, భూమయ్య, శ్యామ్యానాయక్, జిల్లా సంక్షేమాధికారి ఈపి ప్రేమలత, సీనియర్ అసిస్టెంట్ ఎం నాగేంద్ర, ఎఫ్ఆర్ఓ గణేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డెన్ నిర్లక్ష్యంతో బాలికల భద్రతకు ముప్పు

## హాస్టళ్లలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిఎల్ రవి




**ప్రజాపక్షం/ములుగు :** ములుగు జిల్లా కేంద్రంలోని బాలికల హాస్టళ్లలో విద్యార్థినుల భద్రత విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందని, వార్డెన్ల పర్యవేక్షణ లోపాల వలన విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిఎల్ రవి ఆరోపించారు. బాలికల భద్రత విషయంలో అధికారులు తక్షణమే స్పందించి, హాస్టళ్లలో పూర్తి స్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టిఎల్ రవి మాట్లాడుతూ హాస్టళ్లలో చదువుకుంటున్న బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం వార్డెన్లు, సంబంధిత అధికారుల ప్రధాన బాధ్యత అని అన్నారు. విద్యార్థినుల రక్షణ, వారి ఆరోగ్యం, వసతి, ఆహారం, విద్యా వాతావరణం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో పర్యవేక్షణలో లోపాలు ఉన్నట్లు విద్యార్థుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. బాలికల హాస్టళ్లను సంబంధిత ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, వారి తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా హాస్టళ్లలో అవసరమైన అన్ని రక్షణ చర్యలను అమలు చేయాలని కోరారు. విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టిఎల్ రవి హెచ్చరించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉచిత మొబైల్ ఎఐ చెస్ట్ స్క్రీనింగ్ క్యాంప్



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని దుంపెల్లి గూడెం గ్రామంలో గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా క్షయ నివారణ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సీతారాం నాయక్ పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ సీతారం నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపయ్యపల్లి రాంనగర్ ఎల్‌బీనగర్ తదితర గ్రామాల నుంచి 78 మంది హాజరై చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ చేయించుకున్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి బీపీ మలేరియా ఆర్‌డీటీతో పాటు పలు రక్త పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ సీతారాం నాయక్ మాట్లాడుతూ క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి. జిల్లా క్షయ నివారణ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటువంటి స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మధుమేహం అధిక రక్తపోటు జ్వరం దీర్ఘకాలిక దగ్గు తదితర సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సుమారు 10 నిమిషాల్లో ఎక్స్‌రే స్క్రీనింగ్ పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ శ్యామల ఏఎన్ఎం సరిత హెల్త్ అసిస్టెంట్లు సధానందం, జంపయ్య,కృష్ణ, శ్రీనివాస రెడ్డి, టీబీ అలెర్ట్ ఇండియా ప్రతినిధులు ఏపీఎఫ్ కోఆర్డినేటర్ టి.రాజు ఎక్స్‌రే టెక్నీషియన్ సంతోష్ కమ్యూనిటీ మొబిలైజర్ విజయ్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిలో సర్పంచ్ తనిఖీ



**ప్రజాపక్షం/తాడ్వాయి :** మండలంలోని లింగాల గ్రామ పంచాయతీ పరిధిలోని కొడిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్ మొగుళ్ళపల్లి రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి, రోజువారీ వైద్యసేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోజుకు సగటున నుండి మంది ఓపీకి వస్తున్నారని సిబ్బంది వివరించారు. అనంతరం పీహెచ్ వైద్యాధికారి డాక్టర్ విజయ్ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. టాయిలెట్లు, ఫ్యాన్లు, కిటికీలకి సంబంధించిన మైనర్ మరమ్మత్తులతో పాటు సబ్ సెంటర్‌కి సంబంధించిన పలు సమస్యలను ఆయన వివరించారు. స్పందించిన సర్పంచ్ వెంటనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్యం అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల దశ నుండే పరిశుభ్రతను అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/రాయపర్తి :** నేటి విద్యార్థులే భావి భారత స్వచ్ఛభారత్ నిర్మాతలని, పాఠశాల దశ నుండే పరిశుభ్రత అలవర్చుకోవాలని తహసీల్దారు ములుకనూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో ఎంపిడిఓ పాక శ్రీనివాసులు, ఎంపీఓ కూచన ప్రకాష్, సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు ములుకనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే భావి భారత స్వచ్ఛభారత్ నిర్మాతలని పేర్కొన్నారు. పరిశుభ్రత అనేది పాఠశాల దశ నుండే అలవడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠోబా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిల్లా రాజేంద్రప్రసాద్, వార్డు సభ్యులు తాటికాయల నాగరాణి భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నెంబర్లు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేయించాలి

**ప్రజాపక్షం/జనగామ :** జనగామ పట్టణంలో 2012–13లో ఇల్లు లేని నిరుపేదలు 1144 మందికి పేదలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా ఇళ్లు నిర్మాణం చేయకపోవడంతో ఆర్థిక స్థోమత మేరకు నిర్మాణం చేసుకున్న వారికి నెంబర్లు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి నల్ల బ్యాడ్జీలతో జనగామ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడో విడత ఇందిరమ్మ ఇల్లు గుంజుకొని డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేయాలని చూస్తే మూడో విడత లబ్ధిదారులు కోర్టుకు వెళ్లి స్థలాలు రక్షించుకోవడం జరిగిందన్నారు. మూడో విడత లబ్ధిదారులు చిన్న చిన్న రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటున్నారని, వారికి నెంబర్లు ఇవ్వడంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఆర్థిక స్థోమతతో ఇల్లు కట్టుకోలేని 72 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు 2023లో ఇచ్చారన్నారు. పేదలందరికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, ఎండి అజారుద్దీన్, మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి, కళ్యాణం లింగం, పాము శ్రీకాంత్, పల్లెర్ల లలిత, ఎండి గౌసియా, సిలువేరు ఉపేందర్ పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే నైతిక అర్హత లేదు

## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు తెలంగాణ ప్రజలను ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని మాజీ ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని వనపర్తి గ్రామంలో పది లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభం, 20 లక్షల సిసి రోడ్ నిర్మాణం పనుల శంకుస్థాపన, కొత్తపెల్లి గ్రామంలో 37.50 లక్షల నిర్మించిన సీసీ రోడ్లు, కొత్తగా ఇందిర ఇండ్లను అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ అభివృద్ధి చేయాలనే తపనతో నేను పని చేస్తున్నానని వారు అన్నారు. 15 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఏం చేశాడో అని ఒక్కసారి ఆలోచించాలని వారిని గుర్తు చేశారు. నేను ఎమ్మెల్యే అయిన మూడు సంవత్సరాలలో ఏ రకంగా అభివృద్ధి పనులు చేస్తున్నానో మీరు చూస్తున్నారు. నిజాయితీగా ఉంటూ ప్రజల కోసం కష్టపడి పనిచేసే వారికే ప్రజల సహకారం ఉండాలన్నారు. బీజేపీ బిఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ప్రజాస్వామ్యం పేద ప్రజల సంక్షేమం సామాజిక న్యాయం జరిగిందని అన్నారు. పేద వర్గాల గురించి ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వంచ శైలజ ఉపేందర్ రెడ్డి, గాదెపాక విష్ణు, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గుడి వంశీధర్ రెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి శివ కుమార్, మండల అధ్యక్షులు సాదం విజయ మనోహర్, తహశీల్దార్ అందాలు, ఎంపీడీవో శివ శంకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ శాఖల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎలిజిబుల్ జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించామని, అర్హులైన అభ్యర్థులకు కాల్ లెటర్లు అందజేశామన్నారు. అంగన్‌వాడీ టీచర్ అభ్యర్థులకు ఈ నెల 30న, ఆయా అభ్యర్థులకు అక్టోబర్ 1న నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అభ్యర్థులు కాల్ లెటర్‌లో పేర్కొన్న సూచనల మేరకు హాజరు కావాలని ఆమె సూచించారు.

# పలు కుటుంబ సభ్యులను పరామర్శించిన



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ఆపదలో ఉన్న పలు కుటుంబాలను మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పరమర్శించారు. పాపన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటించి ఇటీవల మృతి చెందిన వారి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం కల్పించారు. ముందుగా గాంధారిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు పాశం అంజిరెడ్డి తండ్రి పాశం నాగిరెడ్డి ఇటీవల మృతి చెందారు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జయపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన దాసరి కేశయ్య కుటుంబ సభ్యులను , యూసుఫ్‌పేట గ్రామంలో చామంతుల నారాయణ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కుర్తివాడ గ్రామంలో ఏడుపాయల మాజీ డైరెక్టర్ మోహనరావు అత్తమ్మ మృతి చెందడంతో వారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# ప్రపంచ చెవిటితన దినోత్సవం




**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ చెవిటితన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంగారెడ్డి ఆద్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య హాజరై దివ్యాంగుల హక్కుల వారికి అందుబాటులో ఉన్న న్యాయ సేవలు ఉచత న్యాయ సహాయం ,ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులు ముఖ్యంగా వినికిడి లోపం ఉన్న పిల్లలు, తమ హక్కులను తెలుసుకొని అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఆమె తెలిపారు.

# రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏమైంది..?




**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట ప్రజల కోరిక మేరకు బిఆర్ఎస్ ప్రభుత్వం రామాయంపేటను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్‌ను ఎందుకు కొనసాగించడంలేదని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. పరిపాలనా సౌలభ్యం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవశ్యకతను అప్పటి మంత్రి హరీష్‌రావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో డివిజన్‌తో పాటు డిగ్రీ కళాశాల మంజూరుకు కేసిఆర్ ప్రకటన చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రకటన అనంతరం మాజీ మంత్రి హరీష్‌రావుతో కలిసి రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను ప్రారంబించామని పద్మదేవేందర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జ్ ఆర్డీవోను కూడా నియమించడం జరిగిందన్నారు. అయితే ఎన్నికల అనంతరం డివిజన్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్‌పై ఎమ్మెల్యే, స్థానిక కాంగ్రేస్ పార్టీ నాయకులు సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. డివిజన్‌కు అప్పటి ప్రభుత్వం గెజిట్ తెచ్చినప్పటికి ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా వెనుకబడిందన్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ కొనసాగింపుపై ప్రభుత్వం స్పందించకపోతే దసరా తర్వాత మలి విడత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పోగొట్టుకున్న ఫోన్లో రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో పాపన్నపేట పోలీసులు జిల్లాలోని ప్రథమ స్థానం నిలిచారు. వివరాల్లోకెళ్తే గత కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఫోన్ల బాధితులు మీసేవ ద్వారా కంప్లైంట్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 601 ఫోన్లను పోలీసులు గుర్తించగా అందులో 589 సెల్ ఫోన్లు (98 శాతం) రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మంగళవారం సైతం మరో 12 ఫోన్లు రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితులకు ఫోన్లను అప్పగించారు. ఈ 12 ఫోన్ల విలువ 2 లక్షల 4 వేల500 విలువ ఉంటుందన్నారు. పోగొట్టుకున్న ఫోన్లను అతి త్వరలోనే గుర్తించి రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో పాపన్నపేట పోలీసులు జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలిచారు. గతంలో సైతం పెద్ద ఎత్తున ఫోన్లు రికవరీ చేసి డిఎస్పి చేతుల మీదుగా అందజేశారు. పోయిన ఫోన్లను రికవరీ చేసి అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పదవ తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడంతో పాటు, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులను ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం మరియు సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో బోధన అందిస్తున్నామన్నారు. ఉదయం పాఠశాల సమయానికి ముందు, సాయంత్రం పాఠశాల అనంతరం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు సందేహ నివృత్తి, పునశ్చరణ, ప్రశ్నపత్రాల సాధన, పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరై, ఉపాధ్యాయుల సూచనలను పాటించి, కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

# ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి: సంరక్షించాలి

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** పట్టణంలో ప్రతి ఇంటా ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి వాటి సంరక్షణ తీసుకోవాలని 11 వార్డు కౌన్సిలరు పూదరి వరప్రసాదు పట్టణ ప్రజలను కొరారు. మంగళవారం ఆయన 11 వార్డులో ఇంటింటా పండ్ల, పూల, కూరగాయ మొక్కను పంపిని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వృక్ష సంపద పెంచినట్లుయితే మంచిగాలి పర్యావరణ తో పాటు మనకు ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి ఇంటా పూల పండ్ల కూరగాయ మొక్కలు పెంచడం వల్ల మనకు రోజు నాణ్యమైన కూరగాయలతో పాటు మంచి ఆరోగ్యకరమైన వాతవరణం దొరుకుతుందని అన్నారు. మన ఇంటిలో మనం వాడుకునే నీటిని వృదకాకుండ పెరటి మొక్కలను పెంచుకునేందుకు వాడుకుంటే మొక్కల పెరిగి మనకు నిత్యవసర కూరగాయలతో పాటు మంచి గాలి లబిస్తుందని అన్నారు. మనందరం మొక్కలు పెంచుదాం పర్యావరణను కాపాడుతూ పట్టణంలో పచ్చదం పరిశుభ్రత మెరుగు పరుస్తామని పిలుపు నిచ్చారు.

# సర్వేయింగ్ సూత్రాలపై బలమైన పట్టు సాధించాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రాథమిక సర్వేయింగ్ సూత్రాలపై బలమైన పట్టు సాధించాలని వెంకటేశ్వర రావు బలుసు జాకబ్స్ సొల్యూషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ అన్నారు. బీవీఆర్ఐటి కళాశాలలో మంగళ వారం నాడు జాతీయస్థాయి సర్వే 2026 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటేశ్వరరావు బలుసు హాజరై మాట్లాడారు. సర్వేయింగ్ లో కచ్చితత్వం నమ్మకం, బాధ్యత అత్యంత కీలకమైందని గుర్తు చేశారు. అనంతరం బీవీఆర్ఐటి వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 27 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 56 విద్యార్థి బృందాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొంటున్నారనీ వెల్లడించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న నేషనల్ హైవే అథారిటీ అఫ్ ఇండియా ఎన్‌హెచ్‌ఏఐ గజ్వేల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.మాధవి మాట్లాడుతూ, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు నేషనల్ హైవే అథారిటీ అఫ్ ఇండియా ఎన్ హెచ్ ఏ ఐ అందుబాటులో ఉన్న ఇంటర్న్‌షిప్ అవకాశాలను వివరించారు. ఈ పోటీలో పెద్ద సంఖ్యలో మహిళా విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.

# శస్త్రచికిత్సకు రూ.75 వేల ఎల్వోసీ



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేటకు చెందిన నిజామొద్దీన్‌కు కాలికి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు రూ.75 వేల ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు ఇబ్బంది పడుతున్న నిజామొద్దీన్‌కు ప్రభుత్వం నుంచి ఎల్వోసీ మంజూరు కావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కాలికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో చికిత్స కోసం ఎల్వోసీకి దరఖాస్తు చేసుకోగా రూ.75 వేల విలువైన ఎల్వోసీ మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సహకరించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సుఫీ, మైనార్టీ మండల అధ్యక్షులు ఖలీం, ప్రజాప్రతినిధులు, అధికారులకు నిజామొద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# చేనేత సహకార సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం సంఘం చైర్మన్ కొడపాక విట్టల్ అధ్యక్షతన మంగళవారం పాపన్నపేట చేనేత సహకార సంఘం భవనంలో నిర్వహించారు. సమావేశంలో కొత్తగా చేనేత సభ్యత్వాలు నమోదు చేయాలని, చేనేత వృత్తి వారికి గుర్తింపు కార్డులు, కొత్త సభ్యులకు చేనేత హస్త కళకు సంబంధించి తగిన వృత్తి శిక్షణ కేంద్రాలు కలించి శిక్షణ కల్పించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన చేనేత సభ్యుల వివరాలు సేకరించి అందరికీ చేనేత పింఛన్లను మంజూరు చేయాలని కోరారు. చేనేత సంఘం భవనం వర్షానికి పూర్తిగా పాడై పోయినందున మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. చేనేత వృత్తిలో వెనకబడిన కుటుంబాల విద్యార్థిని,విద్యార్థులకు పై చదువులకు ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేయాలని కోరారు. చేనేత వృత్తిలో కొనసాగుతున్న పద్మశాలి కుటుంబంలో ఎవరైనా మరణించినచో వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశం ప్రారంభంకు ముందు సంఘం డైరెక్టర్ లుగా పనిచేసి ఇటీవల మృతి చెందిన బీకొండ నారాయణ, బద్దాపురం రాములు, పద్మశాలి సంఘం కులసంఘం నాయకులు మరెల్లి రాములు కుటుంబాలకు సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు పల్లె సంగమేశ్వర, పల్లె లక్ష్మణ్, దాసరి యాదయ్య, అచుకట్ల గురునాధం, జూకంటి సంగయ్య, సభ్యులు కల్లేటి సంగమేశ్వర, వళ్ళందేశీ శ్రీనివాస్, బద్దపురం సంగమేశ్వర, పడిగే కిష్టయ్య, పోలశ్రీనివాస్, కొడపాక రాజేశ్వర్, పల్లె రామచందర్, వళ్ళం దేశీ బుచికుమార్, బీకొండ జోగయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి




**ప్రజాపక్షం / మెదక్ :** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎన్ పిఆర్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ, 2027 జనాభా లెక్కల్లో 2016 వికలాంగుల హక్కుల చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల వివరాలను పూర్తిగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల వివరాలు సమగ్రంగా సేకరించకపోతే విద్య, ఉపాధి, వైద్యం, పునరావాసం, సామాజిక భద్రత వంటి హక్కులపై ప్రభావం పడుతుందని అన్నారు. చేయూత పెన్షన్లు పెంచి వెంటనే అమలు చేయాలని, జాతీయ ఆహార భద్రత చట్ట సవరణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి కె. యశోద మాట్లాడుతూ, జిల్లాల్లో 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మెడికల్ కళాశాలకు జప్తు నోటీస్ జారీ

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ పరిధిలోని సురభి మెడికల్ కళాశాల, ఆర్చా ఫార్మా ప్యాక్టరీ, ఎస్‌బిఐ బ్యాంకు భవనానికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. సురబి మెడికల్ కళాశాలకు 49 లక్షలు, ఆర్చ్ ఫార్మా కంపెనికి 16లక్షలు, ఎస్‌బిఐ భవనానికి లక్ష రూపాయలు నోటీసు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కుమార్ తెలిపారు. ఇప్పటికే సురభి మెడికల్ కళాశాలకు రెండు సార్లు డిమాండ్ జారీ చేసిన కనీస స్పందన లేదన్నారు. కళాశాలకు మరో మూడు రోజులు సమయం ఇస్తూ మెడికల్ కళాశాలకు జప్తే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

# మండల నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** టిపిటిఎఫ్ జగదేవ్‌పూర్ మండల నూతన కార్యవర్గం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారి, జోన్ కన్వీనర్ శ్రీనివాస్, పరిశీలకులు రామస్వామి, ఆతిథులుగా నరేందర్, కనకయ్యల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జగదేవ్‌పూర్ టిపిటిఎఫ్ మండల అధ్యక్షులుగా అక్కారం సత్తయ్య, ప్రధానకార్యదర్శిగా తులసిదాసులు ఎన్నిక కాగా ఉపాధ్యాక్షులుగా భాస్కర్, లక్ష్మయ్య, సావిత్రి, ఆస్మా, కార్యదర్శులుగా శివకేశ్, నాగరాజు, గణేశ్, బాలకిషన్, సునిత, జోత్స్న, జిల్లా కౌన్సిలర్స్‌గా నేతి శంకర్, పోచయ్య, బాపురెడ్డి, జలంధర్‌రెడ్డి, వసంతరాణి, ఆకాడమిక్ సెల్ కన్వీనర్‌గా తుమ్మ సత్తయ్య, జిఒల కమిటీ కన్వీనర్‌గా రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా రాములు, సంధ్య, జ్యోతి, భార్గవిలను ఎన్నుకున్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్‌పై తిరగబడ్డ బాధితులు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** తమకు తెలియకుండా, మోసపూరితంగా ఇంటి స్థలాన్ని వేరే వారి పేరుపై అక్రమ రిజిస్ట్రేషన్ చేశారంటూ బాధితులు తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా మనోహరాబాద్‌కు చెందిన మాసనూరి భూమయ్య 2012లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణానంతరం భూమయ్యకు చెందిన 357 గజాల ఇంటి స్థలాన్ని, అప్పటి గ్రామ కార్యదర్శి అండతో దగ్గరి బంధువైన మాసనూరి రవికుమార్ అక్రమంగా చేజిక్కించుకున్నారు. 2013 లో తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన తల్లి మాసనూరి సత్యమ్మ పేరిట గిఫ్ట్ డీడ్ ద్వారా ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అసలు స్థలం 357 గజాలు మాత్రమే ఉండగా, పక్కన ఉన్న వారి స్థలాన్ని కూడా కలుపుకుని ఏకంగా 440 గజాలుగా అక్రమంగా నమోదు చేయించారు.ఆపై ఆ స్థలాన్ని రవికుమార్ తన పేరిట 220 గజాలు,కుమారుడు భాస్కర్ పేరిట 220 గజాలుగా విభజించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అంతేకాకుండా, ఆ ఆక్రమిత స్థలంపై ఒక ఫైనాన్స్ కంపెనీ నుండి రూ.15 లక్షల వరకు ఇళ్ల రుణం (హోమ్ లోన్) కూడా పొందినట్లు బాధితురాలు మాసనూరి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన నాటి గ్రామ కార్యదర్శిని, తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. మోసపూరితంగా సృష్టించిన ఆ పత్రాలను వెంటనే రద్దు చేసి, స్థలాన్ని అసలు వారసులైన తమ పేరిట మార్చాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆపదలో అండగా కష్టాల్లో తోడుగా తిరుపతి రెడ్డి

**ప్రజాపక్షం / మెదక్ :** కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం ఒకే రోజు నాలుగు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. శంకరంపేట, పాపన్నపేట, మెదక్, రామాయంపేట మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.శంకరంపేట మండలం చందంపేట్‌లో విలేకరి తాటికొండ సుధాకర్ తండ్రి కృష్ణ, జంగారాయలో కీర్తన కుటుంబాలను పరామర్శించారు. పాపన్నపేట మండలం కుర్తివాడలో మోహన్ రావు అత్తమ్మ, పుట్టి మల్లేశం కుటుంబాలను ఓదార్చారు. మెదక్ మండలం చిట్యాలలో పట్లోరి రామమ్మ కుటుంబాన్ని, పాతూరులో మైలి భాగయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో ఉన్న ఉప్పు కిష్టయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రామాయంపేట మండలం దామరచెరువులో రోడ్డు



ప్రమాదంలో మృతి చెందిన పిట్ల శ్రీనాథ్ కుటుంబాన్ని పరామర్శించారు.మెదక్ మండలం పాతూరులో నూతన సర్పంచ్ నాగలక్ష్మి , ఉపసర్పంచ్ కట్లే యేసు, వార్డు సభ్యులను సన్మానించి గ్రామ సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. మల్లంపేటలో యువసేన సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

# జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌కు పూజశ్రీ ఎంపిక




**ప్రజాపక్షం/మెదక్ :** జాతీయ స్థాయి నేషనల్ సైన్స్ సెమినార్‌కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్లాపూర్ విద్యార్థిని పూజశ్రీ ఎంపికైంది. హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో "భారతీయ ఇంధన వనరుల సముదాయం 2047–అవకాశాలు, సవాళ్లు" అనే అంశంపై పూజశ్రీ తన సెమినార్ పత్రాన్ని ప్రజెంట్ చేసి ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పూజశ్రీ నిమెమెంటో, నగదు పురస్కారంతో సత్కరించారు. అక్టోబర్ 30న ఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి సెమినార్‌లోనూ ప్రతిభ కనబరచాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ గాజర్ల రమేష్ ఆకాంక్షించారు. పూజశ్రీని జిల్లా విద్యాధికారి రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అభినందించారు.

# రాష్ట్ర ప్రజలు ఆకలినైనా భరిస్తారు.. అవమానాన్ని భరించరు!

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల హక్కుల సంరక్షణకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ విశేష కృషి చేసిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం సిద్దిపేట ఐడిఓసి సమావేశ మందిరంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు నీలాదేవి , రాంబాబు నాయక్‌లు ల్యాండ్ అట్రాసిటీస్, రోస్టర్ పాయింట్ అమలు మరియు బ్యాక్ లాగ్ ఖాళీలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అక్టోబర్ 4వ తేదీతో తమ పదవి కాలం పూర్తవుతుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చట్టానికి లోబడి రాష్ట్రవ్యాప్తంగా దళితులు, గిరిజనుల హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో విశేష కృషి జరిగిందని అన్నారు. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగం అంటేనే కత్తిమీద సాము అని, ఎస్సీ ఎస్టీలు వందల సంవత్సరాలుగా అణచివేతకు గురయ్యారని వారి హక్కులను కాపాడే ప్రయత్నంలో ప్రభుత్వ ఉద్యోగులతో కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అన్నారు. ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరగాలని కోరుకొని ఉద్యోగుల వెంట పడ్డామన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వల్ల తాను అన్ని సాధించానని, అదేవిధంగా నా జాతి వాళ్లు అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యం అని అన్నారు. తెలంగాణ వాళ్లు ఆకలినైనా భరిస్తారు కానీ అవమానాలను భరించరని వివిధ సమస్యలపై అధికారుల వద్దకు వచ్చే ప్రజలను ముఖ్యంగా దళితులు, గిరిజనుల పట్ల స్నేహభావంతో వ్యవహరించాలని ఉద్యోగులకు సూచించారు. ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ఆ కార్యక్రమంలో మండల తాసిల్దార్, స్థానిక ఎస్సై, డివిఎంసి సభ్యులు, అధికారులు పాల్గొని ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి వాటిని ఉపయోగించుకునేలా చైతన్యపరచాలని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డిస్టిక్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఉద్యోగ నియామకాలలో రోస్టర్ విధానం పాటించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల నిధులను వారి అభ్యున్నతికి మాత్రమే ఉపయోగించాలని, వాటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలయాపన చేయకుండా బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేయాలని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 102 కోట్ల రూపాయల బకాయిలను అక్టోబర్ నెలలో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అదేవిధంగా పెండింగ్ స్కాలర్షిప్స్, కులాంతర వివాహాల ప్రోత్సాహం ఇదితర అన్ని సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అనుకూలంగా స్పందించారని అన్నారు. జిల్లాకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. వినాయక చవితి సందర్భంగా భోజనాల వడ్డించడంలో సిద్దిపేట అర్బన్ మండలం ఇమాంబాద్ లో జరిగిన వివక్షత పై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తన వ్యక్తిత్వంతో కమిషన్ చైర్మన్ పదవికి వన్నెతెచ్చారని అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి పెండింగ్లో లేకుండా చూసుకుంటున్నామని ప్రభుత్వం నుండి బడ్జెట్ విడుదల కాగానే ఎప్పటికప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్నామని తెలిపారు. సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను సీరియస్ గా తీసుకొని 60 రోజుల్లోనే కేసులను దర్యాప్తు చేస్తూ బాధితులకు న్యాయం చేస్తున్నామని అన్నారు. ప్రతి నెల ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై డివిజన్ల వారీగా రివ్యూ చేస్తూ బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు మండల విద్యార్థులు ఎంపిక..

**ప్రజాపక్షం/బెజ్జంకి :** సిద్దిపేట జిల్లా అత్యపాత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల పోటీలకు హుస్నాబాద్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల (బెజ్జంకి)లో చదువుతున్న భావన,కీర్తిప్రసన్న ఇంటర్ ప్రథమ సంవత్సరం,పొత్తూరి తన్మయి 9వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనభరిచి రాష్ట్ర స్థాయి అత్యపాత్య పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ వీరలక్ష్మి తెలిపారు.జగిత్యాల జిల్లాలో 11,12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అత్యపాత్య పోటీల్లో వారు పాల్గొననున్నట్లు వారు తెలిపారు.ఈ సంధర్భంగా పాఠశాల బృందం విద్యార్థులను సన్మానించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం

**ప్రజాపక్షం/కొమురవెల్లి :** వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం (ఎమ్మెల్సీ) ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు. కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన అర్హులైన పట్టభద్రులు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులై కనీసం మూడేళ్లు పూర్తయిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులు ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను https://ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా లేదా సంబంధిత అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు.
దరఖాస్తుతో పాటు డిగ్రీ/ప్రొవిజనల్ డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం తదితర ఆధారాలు జతచేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు.

# పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** మంగళవారం రోజున కొమురవెల్లి లో సర్పంచ్ గొల్లపల్లి పద్మాంజనేయులు పంచాయతీ సెక్రెటరీ సిహెచ్ కర్ణాకర్ వార్డు సభ్యులు అందరి సమక్షంలో గ్రామపంచాయతీ ఆవరణంలో పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై జిల్లా సాంస్కృతిక సారధి కళాకారులచే అవగాహన కల్పించడం జరిగింది తడి చెత్త అప్పుడు చెత్త వేరువేరుగా చేసి మీ యొక్క ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ గారు గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది ఈ వార్తను ఇంకాస్త మంచిగా ఇవ్వండి.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన పీఏసీఎస్ చైర్మన్

**ప్రజాపక్షం/బెజ్జంకి :** మండల కేంద్రానికి చెందిన తిప్పారపు సురేష్,దాచారం గ్రామానికి చెందిన మంద ఎల్లవ్వ,గుండారం గ్రామానికి చెందిన బోడపట్ల మల్లయ్యలు ఇటీవల మరణించగా మంగళవారం పీఏసీఎస్ చైర్మెన్ ఒగ్గు దామోదర్,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌లు భాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఎస్‌జిఎఫ్ యూ-19 వాలీబాల్ పోటీ విజేత దౌల్తాబాద్

**ప్రజాపక్షం/కోహెడ :** కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలో దౌల్తాబాద్ జట్టు విజేతగా నిలిచింది. సిద్దిపేట ప్రభుత్వ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు ఇంటర్మీడియట్ విధ్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి బహుమతులను అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్గనూజింగ్ సెక్రటరి సమ్మయ్య, సిబ్బంది యదగిరి, రాజమౌళి, రాజేశ్వర్ రెడ్డి, అశోక్, నరేష్, సీతారామయ్య, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, రజిత, నీరజ, సుజాత, వవిధ కశాళాల పిడిలు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

